హవ్వ... ఇవి సౌధాలట!



కపిలతీర్థం కూడలి వద్ద ఉన్న టీడీపీ తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సొంత స్థలంలో నిర్మించుకున్న చిన్న భవనం


తిరుపతి - రేణిగుంట రోడ్డులోని ఆటోనగర్ వద్ద నరసింహయాదవ్ ఏర్పాటు చేసుకున్న జిల్లా టీడీపీ ఆఫీసు. ఇది అద్దె భవనం

ఎంతటి అబద్ధాన్నైనా దబాయించి చెబితే నిజం అవుతుందన్నది జగన్‌రెడ్డి సిద్ధాంతం. అబద్ధాలను వండివార్చి వడ్డించడంలో ఆయన సొంత పత్రిక ఆరితేరింది. ఊరూరా రుషికొండ తరహా ప్యాలెస్‌లను వైసీపీ ఆఫీసుల పేరుతో నిర్మిస్తున్న సంగతి బట్టబయలు కావడంతో ఉలిక్కిపడ్డ జగన్ పార్టీ టీడీపీపై ఎదురుదాడికి దిగింది.టీడీపీ కూడా జిల్లాల్లో పచ్చ సౌధాలు నిర్మించుకుందంటూ ఒక ఫొటో కథనాన్ని సోమవారం అచ్చేసి వదిలింది. ఇందుకు సాక్ష్యంగా రాజకోటల్లా ఉన్నాయంటూ టీడీపీ తిరుపతి జిల్లా కార్యాలయం, తిరుపతి నగర కార్యాలయం ఫొటోలను కూడా ప్రచురించింది. విమానాశ్రయానికి అత్యంత సమీపంలో ఎకరాకు ఏడాదికి వెయ్యి రూపాయల అద్దెకు రెండెకరాల విలువైన ప్రభుత్వ భూమిని 33 ఏళ్లకు సొంతం చేసేసుకున్న జగన్‌రెడ్డి పార్టీకి ప్రయివేటు ఇరుకు భవనాల్లో నడుస్తున్న టీడీపీ ఆఫీసులు సౌధాల్లా కనిపించడం విశేషం. మొహం నిండా అమాయకత్వాన్ని పులుముకున్నంత మాత్రాన అబద్ధం, నిజమైపోదనేందుకు ఈ ఫొటోలే సాక్ష్యం.


తిరుపతి విమానాశ్రయం దగ్గర రెండు ఎకరాల విస్తీర్ణంలో దాదాపుగా పూర్తయిన వైసీపీ ఆఫీసు భవనం

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుమలలో శ్రీలీల

తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : సినీ హీరోయిన్ శ్రీలీల సోమవారం తిరుమలకు వచ్చారు.జీఎంఆర్ అతిథిగృహంలో బస చేశారు.మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

సీజన్ ముగిసేటప్పుడూ ధరాఘాతమే


పుత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మామిడి కాయలు

ఒకే రోజు రూ.5 వేలు తగ్గిన తోతాపురి
ధరను భారీగా తగ్గించేసిన పల్ప్ ఫ్యాక్టరీలు
జూదాన్ని తలపిస్తోందంటున్న మామిడి రైతు

పుత్తూరు అర్బన్, జూన్ 24: మామిడి సీజన్ ముగింపు దశకు చేరుకుంది. ఆఖరులోనైనా మంచి ధర లభిస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రధానంగా పల్ప్ ఫ్యాక్టరీలు వినియోగించే తోతాపురి ధర జూదాన్ని తలపిస్తోందనే మాటలు వినబడుతున్నాయి. ఒకే రోజు టన్నుపై రూ.5 వేలు తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్ పుణ్యమా అని ఈ ఏడాది కూడా మామిడి రైతులు నష్టాలనే మూటగట్టుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క రోజులో పతనం

మామిడి సీజన్ ఈ ఏడాది ఒడిదుడుకుల మధ్యే ప్రారంభమైంది. పుత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సీజన్ ప్రారంభమైన మే మాసంలో ప్రధాన రకమైన తోతాపురి టన్ను రూ.20 వేలు పలికింది. జూన్ మొదటి వారం వచ్చేసరికి రూ.28 వేలకు చేరింది. ఈ ఏడాది దిగుబడి కేవలం 20 శాతం మాత్రమే ఉండడంతో ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ పల్ప్ ఫ్యాక్టరీలు రోజుకో ధరను నిర్ణయిస్తూ తోతాపురి ధరను పక్కా జూదంగా మార్చేశాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం టన్ను రూ.27 వేలు పలికిన తోతాపురి సోమవారానికి రూ.22 వేలకు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా సీజన్ ముగింపు దశకు చేరుకున్నప్పుడు సరఫరా తగ్గిపోవడంతో ధరలు పెరుగుతాయి. అయితే ఈ ఏడాది మాత్రం ముగింపు సమయానికి ధరలు పతనమవుతుండడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగిలింది పుల్లూరా రకమే....

జిల్లాలో తోతాపురి తరువాత అత్యధికంగా సాగులో ఉండే మామిడి రకం పుల్లూర(నీలం). దీని ధర కూడా అంతంత మాత్రంగానే ఉంది. సోమవారం పుత్తూరు మార్కెట్ యార్డులో టన్ను రూ.30-35 వేలు పలికింది. సాధారణంగా రోజుకు 100 టన్నులు వచ్చే పుల్లూర రకం ప్రస్తుతం యార్డుకు సరాసరి 18 టన్నులు మాత్రమే వస్తున్నట్లు మండీ యజమానులు చెబుతున్నారు. అయితే కనీసం పుల్లూర రకం మామిడికైనా మంచి ధర లభించేలా వ్యవసాయ మార్కెటింగ్ విభాగం అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కలెక్టర్ల ఆదేశాలు తూచ్

పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్‌ను పసిగట్టిన రైతులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ద్వారా ఈ నెల 9వ తేదీన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించాలని విన్నవించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వం తోతాపురి ధర విషయంలో జోక్యం చేసుకుంది. తిరుపతి, చిత్తూరు జిల్లా కలెక్టర్ల ద్వారా టన్ను రూ.30 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే ఏ రోజూ ఫ్యాక్టరీలు కలెక్టర్లు నిర్దేశించిన ధరకు కొనుగోలు చేయలేదు.దీంతో సీజన్ ముగింపులో కూడా ఫ్యాక్టరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతుల కష్టాలను సొమ్ము చేసుకుంటున్నాయనే విమర్శలు తలెత్తుతున్నాయి.

రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా హనుమంతరావు

ఏడు నెలలుగా సెలవులో ఉన్న అధికారిని నియమించడంపై విమర్శలు

గతంలో పనిచేసిన శాఖలో రిలీవ్ కాకనే కొత్త పోస్టులో చేరడంపై చర్చ


బాధ్యతలు స్వీకరించిన హనుమంతరావు

తిరుపతి(వైద్యం), జూన్ 24 : రుయాస్పత్రిలో డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ సి.హనుమంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే ఏడు నెలలుగా మెడికల్ లీవులో ఉన్న ఆయన తాను గతంలో పనిచేసే శాఖలో రిలీవ్ కాకుండానే ఏకంగా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టారన్న విమర్శలొస్తున్నాయి. ఆస్పత్రి వర్గాల్లో దీనిపై చర్చ నడుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. హనుమంతరావు గతంలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో గూడూరు డివిజన్‌కు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించే వారు. అనారోగ్య కారణాలతో గత ఏడాది నవంబరు ఒకటినుంచి ఈనెల 17వ తేదీవరకు మెడికల్ లీవులో ఉన్నారు. ఈ క్రమంలో తిరిగి విధుల్లో చేరుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారికి రిపోర్టు చేయలేదు. ఈ పరిస్థితుల్లో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి ఆయన్ను నేరుగా రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా నియమించడమే విమర్శలకు తావిచ్చింది.

నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేశారు!

ఇవన్నీ ఇలా ఉంటే.. హనుమంతరావు మెడికల్ లీవులో ఉన్నప్పుడు నిబంధనల విరుద్ధంగా పుత్తూరు మండలంలోని అన్న గౌరి మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారని సమాచారం.

టాస్క్‌ఫోర్సు ఎస్పీ బాధ్యతల స్వీకారం



తిరుపతి(నేరవిభాగం), జూన్ 24: ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరుదైన ఎర్రచందనం సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అటవీ, పోలీసు, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుపై ఉందన్నారు. అందువల్ల అన్నిశాఖలతో సమన్వయం చేసుకుని ఎర్రచందనం స్మగ్లింగ్ అడ్డుకోవడంపై దృష్టి పెడతామన్నారు. దీనికి ప్రజలు, మీడియా సహకారం అవసరమన్నారు.

పీజీఆర్ఎస్‌కు 119 ఫిర్యాదులు

దాదాపు మూడు నెలల తరువాత వినతులను స్వీకరించిన అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 24 : ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల కోడ్ వచ్చాక ఆగిపోయిన సంగతి తెలిసిందే.మూడు నెలల తరువాత తిరుపతి కలెక్టరేట్ సహా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో స్పందన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) పేరుతో నిర్వహించారు.జిల్లా నలుమూలలనుంచి విచ్చేసిన జనం సమస్యలపై వినతిపత్రాలను సమర్పించారు.ప్రభుత్వ తాజా మార్గదర్శకాల ప్రకారం ఒక క్రమ పద్ధతిలో అర్జీదారులు వేచి ఉండేలా గదిని ఏర్పాటు చేశారు.ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచల కిషోర్, ఇతర జిల్లా అధికారులు వినతులు స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 119 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.


ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర

గ్రీవెన్స్ డేలో ఎమ్మెల్యే నాని



చంద్రగిరి, జూన్ 24: చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని విచ్చేశారు.అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.రెవెన్యూ సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. చంద్రగిరిలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలను,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని పోలీసులను ఆదేశించారు.

వైసీపీ నేతలు బెదిరించి రాజీనామా చేయించారు

● మాజీ వలంటీర్ల గోడు



శ్రీకాళహస్తిలో కరోనా వంటి సమయాల్లో ఎంతో నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలందించాం. అయితే ఎన్నికల సమయంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఆదేశాల మేరకు ఆయన అనుచరులు బెదిరించి తమ చేత రాజీనామాలు చేయించారని శ్రీకాళహస్తి నుంచి విచ్చేసిన వందమందికి పైగా వలంటీర్లు కలెక్టరేట్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.తాము రాజీనామా చేసిన తేదీలకు ముందే మున్సిపల్ కమిషనర్ లాగిన్ నుంచి విధుల నుంచి తొలగించినట్లు అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు.సీఎం చంద్రబాబు కరుణించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

పింఛను కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నా


అంధుడు రాధాకృష్ణను తీసుకెళుతున్న కలెక్టరేట్ సిబ్బంది

ఐదేళ్లుగా పెన్షన్ కోసం కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరించలేదని పుత్తూరుకు చెందిన అంధుడు రాధాకృష్ణ అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

పట్టా భూమిని డీకేటీ చేశారు



తన పేరుతో సాగు చేసుకుంటున్న 78సెంట్ల సెటిల్‌మెంట్ పట్టా భూమిని విక్రయించాలని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఆ భూమి డీకేటీలో వుందంటున్నారని ఏర్పేడు మండలం చెల్లూరు హరిజనవాడకు చెందిన కృష్ణయ్య వాపోయాడు.ఇందుకు కారకులైన ఏర్పేడు రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని తన భూమి తనకు ఇప్పించాలని కృష్ణయ్య కోరారు.

బర్డ్‌లో ఆగిన ఉచిత మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు

తిరుపతి(వైద్యం), జూన్ 24: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రిలో ఈనెల ఒకటో తేదీనుంచి ఉచిత మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిలిపేయడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. బర్డ్ ప్రత్యేకాధికారిగా గతంలో పనిచేస్తున్న డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి గత నెల 31వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. మరుసటి రోజునే ఆయన స్థానంలో ఆర్ఎంవో డాక్టర్ కిశోర్‌కుమార్‌ని ఇన్‌చార్జిగా టీటీడీ నియమించింది. ఆయన బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ఈ శస్త్ర చికిత్సలను నిలిపేశారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. వీటిల్లో మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత అమర్చే ఇంప్లాంట్ సాధారణమైనది రూ.72వేలు, నాణ్యమైనదైతే రూ.1.35 లక్షలు చెల్లించాలి. మూడు వారాల వ్యవధిలో దాదాపు 70కిపైగా మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. వీటిల్లో అన్నీ నగదు చెల్లించిన వారికి మాత్రమే చేయడం విశేషం. ఇక గత ప్రభుత్వ హయాంలో సిఫారసులున్న వారికే శస్త్ర చికిత్సలు చేసేవారు. తాజాగా ఉచిత శస్త్రచికిత్సలు పూర్తిగా ఆపేయడంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై బర్డ్ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, ఆర్ఎంవో కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా.. రెగ్యులర్ డైరెక్టరు లేనందున ఉచిత శస్త్ర చికిత్సలు చేయడం లేదని చెప్పారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే చేస్తున్నామన్నారు. రెగ్యులర్ డైరెక్టరును నియమించే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

... అను నేను

చిత్తూరు,తిరుపతి ఎంపీలుగా సోమవారం దగ్గుమళ్ల ప్రసాదరావు, గురుమూర్తి లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేశారు.





నేడు, రేపు కుప్పంలో సీఎం పర్యటన

కుప్పం, జూన్ 24: తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో మంగళ, బుధవారాల్లో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఆయన తొలిసారిగా కుప్పం వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.55 గంటలకు శాంతిపురం మండలంలోని జల్లిగానిపల్లె, 1.35 గంటలకు చిన్నారిదొడ్డి గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువను పరిశీలించి కుప్పంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. 3 గంటలకు ఎన్టీ ఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4.40 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పార్టీ నేతలతో సమావేశమవుతారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ అధికారులతో అభివృద్ధిపై సమీక్షిస్తారు. 2.40 గంటలకు పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. సాయంత్రం 4.10 గంటలకు హెలికాప్టరులో బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మరోవైపు తమ నాయకుడికి ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ నేతలు, శ్రేణులు సిద్ధమవుతున్నారు.

జడ్పీ హైస్కూల్ మైదానంలో ప్రైవేటు క్రికెట్ అకాడమీ!

వైసీపీ అండతో బరితెగించిన ఆర్టీసీ ఉద్యోగి

ప్రశ్నించిన ఉపాధ్యాయులకు బెదిరింపులు

లక్షలాది రూపాయల విద్యుత్ చౌర్యం

స్కూల్ మైదానంలో గంజాయి మూక ఆగడాలతో బెంబేలెత్తుతున్న విద్యార్థులు

తిరుచానూరు, జూన్ 24 : వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలు ఇపుడిపుడే వెలుగులోకి వస్తున్నాయి.అధికార మార్పిడి జరగడంతో బాధితులు ధైర్యం చేసి బయటకు వస్తున్నారు.అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.తిరుపతి రూరల్ మండలంలోని పద్మావతిపురం జడ్పీ హైస్కూల్ మైదానంలో వైసీపీ నేతల అండదండలతో ఓ ఆర్టీసీ ఉద్యోగి క్రికెట్ అకాడమీ నెలకొల్పి శిక్షణ రూపంలో లక్షలాదిరూపాయలు వసూలు చేసిన బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది.ఉపాధ్యాయులతో పాటు స్థానికులు తెలిపిన వివరాల మేరకు.... పద్మావతిపురానికి చెందిన ఓ ఆర్టీసీ ఉద్యోగి స్థానిక పంచాయతీ పాలకమండలిలోని ఇద్దరు వైసీపీ నేతల సహకారంతో హైస్కూల్ మైదానాన్ని క్రికెట్ అకాడమీ ఏర్పాటు పేరుతో ఆక్రమించాడు. పంచాయతీ వీధిలైట్లకున్న విద్యుత్ కనెక్షన్ వాడుకుని సుమారు 20 ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశాడు. ప్రభుత్వ పాఠశాలలో మీ దౌర్జన్యం ఏమిటంటూ అడ్డుకున్న ఉపాధ్యాయులను అప్పటి ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లి హెచ్చరించి పంపారు. క్రికెట్ అకాడమీకి శిక్షణ నిమిత్తం వచ్చే విద్యార్థుల నుంచి నెలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.అంతేకాకుండా పాఠశాల ప్రహరీ గోడను కూల్చి సొంత గేటును ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. దానికి తాళాలు వేయకపోవడంతో కొంతమంది యువకులు స్కూలు ఆవరణలోనే గంజాయి, మద్యం సేవించి ప్రశ్నించిన ఉపాధ్యాయులను బెదిరించడం పరిపాటిగా మారింది. ఇదే స్కూల్ ఆవరణలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ఉంది.ఆడుకోవడానికి మైదానానికి వచ్చిన పిల్లలను గంజాయి సేవించడాని కొచ్చిన ఆకతాయిలు అల్లరి చేస్తున్నారు. ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దాడికి దిగుతున్నారు.గతంలో డీఈవో శేఖర్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.పంచాయతీ వీధిలైట్లకున్న విద్యుత్ కనెక్షన్ వాడుకుంటుండడంపై ట్రాన్స్‌కో అధికారిని అడగ్గా పంచాయతీకి ఇచ్చిన కనెక్షన్ నుంచి కరెంటు తీసుకుంటున్నారు కాబట్టి తమ శాఖకేం నష్టం లేదని చెప్పుకొచ్చారు.



జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో క్రికెట్ కోచింగ్ ఏర్పాట్లు



దౌర్జన్యంగా హైస్కూల్ గోడ కూలదోసి ఏర్పాటు చేసిన గేటు



క్రీడామైదానంలో మద్యం సీసాలు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పాకాల, జూన్ 24: ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలను విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర నాయుడు వితరణ చేశారు. ఆయనకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.మోహిద్దీన్ బాషా ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకులు మోహన్ బెహరా, ఈశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



రామచంద్రాపురం, జూన్ 24: బలిజపల్లె పాఠశాలకు అదే గ్రామానికి టీడీపీ నాయకులు 30మంది విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని హెచ్‌ఎం రాజ్యలక్ష్మికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ- విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు.

కణితి మాంసం స్వాధీనం

ఇద్దరి అరెస్టు, నాటు తుపాకి, బైక్ సీజ్



భాకరాపేట, జూన్ 24: కణితి మాంసం తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కణితి మాంసంతోపాటు నాటు తుపాకి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. భాకరాపేట ఫారెస్టు రేంజర్ దత్తాత్రేయ తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె షికారీ కాలనీకి చెందిన సురేశ్, శ్రీనివాసులు నాటు తుపాకీతో కణితిని కాల్చి మాంసం తీసుకొస్తుండగా భాకరాపేట బీట్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండుకు పంపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు సదాశివయ్య, లోకనాథం పాల్గొన్నారన్నారు.

పులివర్తి నానీకి సన్మానం



నానీని సన్మానించి, అభినందనలు తెలుపుతున్న జయరామయ్య, బాలాజి తదితరులు

తిరుచానూరు/పాకాల, జూన్ 24: చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం తిరుచానూరు సమీపంలోని రఘునాథ్ రిసార్ట్సులోని నివాసంలో సోమవారం మంజుల కళానిధి చైర్మన్ జయరామయ్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శాంబోలు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

● అలాగే తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజి కూడా నానీని కలిసి అభినందనలు తెలిపారు. ఆయనవెంట టీడీపీ నాయకుడు భాష్యం మదనమోహన్ చౌదరి తదితరులున్నారు.

రేపు తలకోనలో వ్యాపార గదులకు వేలంపాట

ఎర్రావారిపాలెం, జూన్ 24: తలకోనలో వ్యాపార గదులకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో జయకుమార్ తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలోని షాపు నెంబరు 2, 3 గదులను బాడుగ ప్రతిపాదికన ఏడాది పాటు వ్యాపారం జరుపుకోవడానికి వేలంపాట 26న మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యలయంలో జరగనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు రూ.5వేల ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

10మంది జూదరుల అరెస్టు

అందరూ తిరుపతివాసులే

కారు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.70వేల స్వాధీనం

ఎర్రావారిపాలెం, జూన్ 24: పది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కారు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.70వేలను భాకరాపేట సర్కిల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ దస్తగిరి సమాచారంతో భాకరాపేట సీఐ మస్తాన్ వలి ఆధ్వర్యంలో ఎస్ఐ విజయకుమార్, సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం ఎర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీ పులిగోను పల్లె సమీపంలోని మూడు కిలోమీటర్ల దూరంలోని మామిడి తోటల్లోని స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో బాబురెడ్డి, అశోక్‌రెడ్డి, రమేష్, ప్రకాష్, మునస్వామి, సాయిశేఖర్, లక్ష్మణరెడ్డి, ప్రభాకర్, పట్టాభి, సుధాకర్ ఉన్నారు. వీరంతా తిరుపతికి చెందిన వారుగా గుర్తించారు. రూ.70వేలతోపాటు మూడు ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ సమస్యలపై కార్యాలయాల్లో ఫిర్యాదు చేయండి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 24: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఆయా సెక్షన్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫిర్యాదు పుస్తకాల్లో నమోదు చేయాలని ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. వీటిని ప్రతి మూడు రోజులకోసారి పరిశీలించి, పరిష్కరిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధులు, మహిళల సమస్యలకు ప్రాధాన్యం

పీజీఆర్ఎస్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 24: వృద్ధులు, మహిళల సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 85 అర్జీలు అందాయని.. వీటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలతోనే విద్యార్థులకు భవిత

కేంద్ర మాజీ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్



క్రియా వర్శిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

శ్రీసిటీ, జూన్ 24: కొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తే భవిష్యత్తు విద్యార్థులదేనని కేంద్ర ప్రిన్సిపల్ సైంటిఫిక్ మాజీ అడ్వైజర్ విజయరాఘవన్ అన్నారు. శ్రీసిటీలోని క్రియా యూనివర్శిటీలో సోమవారం జరిగిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విభిన్న దృక్కోణాల నేపథ్యంలో విద్యార్థులు ప్రపంచాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. క్రియా , చెన్నై వర్శిటీలకు చెందిన 350 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు, అవార్డులు అందజేశారు. జెరూసలెంలోని హిబ్రూ వర్శిటీ హ్యూమనిస్టిక్ స్టడీస్ ప్రొఫెసర్ డేవిడ్ షల్మాన్ రెనీలాంగ్, ప్రథమ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈవో డాక్టర్ రుక్మిణీ బెనర్జీలకు వారి రంగాల్లో విశేష సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. క్రియా వర్శిటీ ఛాన్సలర్ లక్ష్మీనారాయణన్, వీసీ నిర్మాలారావు, ఐఎఫ్ఎంఆర్ డీన్ లక్ష్మీకుమార్, ఎస్ఐఏఎస్ అకడమిక్ డీన్ డాక్టర్ పృథ్వీదత్తా చంద్రశోభి, రీసెర్చ్ విభాగ డీన్ శివకుమార్ శ్రీనివాసన్ ఇతర క్రియా అధికారుల సమక్షంలో పట్టాలను ప్రదానం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

పీజీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని



అధికారులతో మాట్లాడుతున్న పులివర్తి నాని

చంద్రగిరి, జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే సీఎం చంద్రబాబు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. మొత్తం 68 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. విద్యుత్, ఆర్అండ్‌బీ, విద్య, దివ్యాంగుల సంక్షేమం, వ్యవసాయం, వెటర్నరీ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున, ఫించన్లపై 11, రెవెన్యూకు 33, ఆర్టీసీకి 2, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలపై నాలుగు చొప్పున, గ్రామ పంచాయతీకి 8 అర్జీలు ఉన్నాయి. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ధ్రువపత్రాలను త్వరగా జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వ భూముల కబ్జాకు గురికాకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. చంద్రగి- రేణిగుంట మధ్య ఆర్టీసీ బస్సుల సౌకర్యం పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. చంద్రగిరిని గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని పోలీసులను కోరారు. అనంతరం అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకట సూర్యసాయి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం



తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు సోమవారం రూ.20లక్షలు విరాళంగా అందాయి. జార్ఖండ్‌కు చెందిన సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ ఈ విరాళాలను అందజేసింది. ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. ఈమేరకు సంస్థ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర సోమవారం తిరుమలలోని గోకులం విశ్రాంతి గృహంలో ఈవో శ్యామలరావుకు డీడీలను అందజేశారు.

మంత్రి లోకేశ్‌కు శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 24: వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ని చంద్రగిరి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏపీఈఈయూ



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 24: సదరన్ డిస్కం పరిధిలో ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే ఏపీఈఈయూ(1104) లక్ష్యమని రాష్ట్ర ముఖ్య సలహాదారు చంద్రశేఖర్ అన్నారు. తిరుచానూరు రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం జరిగిన యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులతోపాటు పదోన్నతుల సమస్యలను కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎంపిక

రాష్ట్ర కౌన్సిల్ సమావేశం తర్వాత నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఏపీఈఈయు(1104) సదరన్ డిస్కం అధ్యక్షుడిగా ఎ.వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.నజీర్‌ఖాన్, కార్యదర్శిగా వి.దేవేంద్రరెడ్డి, ముఖ్య సలహాదారుగా చంద్రశేఖర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఎంవీ గోపాలరావు తెలిపారు. డిస్కం కార్యదర్శిగా నాల్గవ పర్యాయం ఎన్నికైన దేవేంద్రరెడ్డిని ఘనంగా సత్కరించారు. డిస్కం పరిధిలోని నాయకులు ఆర్.సంజీవరావు, ఎన్.శర్మ, బి.గురునాథరావు, ఆర్.శ్రీనివాస్, ఎస్.కృష్ణయ్య, పి.జగదీష్, తిరుపతి సర్కిల్ నాయకులు వెలగటూరి గోపి, వేణు, బాలకృష్ణ, రాజేష్, దామోదర్‌రెడ్డి, మునస్వామి, నందగోపాల్, సురేష్, జాఫర్‌వల్లీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పనులు ఆపాలని చెప్పినా కట్టేశారు!

తిరుపతి జిల్లా వైసీపీ భవన నిర్మాణంపై ఏపీఐఐసీ వివరణ

తిరుపతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కుర్రకాల్వ గ్రామ పరిధిలో వైసీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులు ఆపాలని చెప్పినా నిలపకుండా నిర్మాణం పూర్తి చేసేశారని ఏపీఐఐసీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2007లో ఐటీ పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీ కుర్రకాల్వ గ్రామంలో 217, 218 తదితర సర్వే నంబర్లలోని 147.90 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచీ సేకరించిందని అందులో పేర్కొంది. ఆ భూమిని అభివృద్ధి చేసి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలకు కేటాయించడం జరిగిందని తెలిపింది.2022 డిసెంబరు 20న ప్రభుత్వం 219-15, 219-16 సర్వే నంబర్లలోని రెండెకరాల భూమిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించిందని తెలిపింది. 33 ఏళ్ళ కాలపరిమితితో ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు ప్రాతిపదికపై ఈ కేటాయింపు జరిగిందని వివరించింది.ఆ భూమిలో పార్టీ కార్యాలయ భవన నిర్మాణం మొదలు పెట్టిన తర్వాత ఆ స్థలం ఏపీఐఐసీ-ఐఏఎల్‌ఏ పరిధిలో వున్నందున సంబంధిత ఓబీపీఎంఎస్ పోర్టల్ ద్వారా గతేడాది సెప్టెంబరు 29న అనుమతి కోసం దరఖాస్తు అందిందని తెలిపింది. ఆ దరఖాస్తును పరిశీలించిన ఐలా కార్యనిర్వహణాధికారి దరఖాస్తులోని లోపాలను తెలియజేసి, చెల్లించాల్సిన మిగులు రుసుమును సూచించడంతో పాటు తక్షణం నిర్మాణ పనులను నిలిపివేయాల్సిందిగా గతేడాది అక్టోబరు 4వ తేదీన ఆన్‌లైన్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించింది. అయినా భవన నిర్మాణ పనులు ఆపకుండా పూర్తి చేశారని తెలిపింది. సంబంధిత స్థలంలో నిర్మాణ బాధ్యత నిర్వహిస్తున్న వారికి పనులు ఆపాలని మౌఖికంగా తెలియజేయడంతో పాటు ఆ మేరకు భవన గోడలకు నోటీసులు కూడా అంటించడం జరిగిందని తెలిపింది.

ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించండి



కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 24: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నేతలు రవి తదితరులు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.కాగా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలను ప్రభుత్వం చెల్లించాలని ఏపీ రైతుసంఘం తరపున జిల్లా కార్యదర్శి హేమలత అధికారులను కోరారు.

ముత్తరాశిపాళెంలో దళితుల శ్మశానాన్ని ఆక్రమిస్తున్నారు

దొరవారి సత్రం మండలం తల్లంపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ముత్తరాశిపాళెంలో దళితులకు 40సెంట్లు శ్మశాన వాటిక ఉంది. సదరు శ్మశాన వాటిక స్థలంలో అయ్యపాళెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గదులు కడుతున్నాడని, దీనిపై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యాలకు దిగుతున్నాడని గ్రామానికి చెందిన మునెమ్మ, గురవయ్య, చెన్నకేశవులు, శాంతి తదితరులు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్మశాన స్థలంలో చేపట్టిన అక్రమనిర్మాణాలను తొలగించాలన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



ఉప్పరపల్లె ప్రాథమిక పాఠశాలలో..

తిరుపతిరూరల్, జూన్ 24: తుమ్మలగుంట పంచాయతీలోని ఉప్పరపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన టీడీపీ జిల్లాప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి చేతులమీదుగా కిట్లను అందజేశారు. టీడీపీ నాయకులు చెంగల్రామానాయుడు, శ్రీనివాసులురాయల్, భరత్ కుమార్‌రెడ్డి, చెంచుశేఖర్, అయ్యప్ప, నవీన్, సురేష్, ఉమాపతి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



యోగిమల్లవరం ప్రాథమిక పాఠశాలలో..


తిరుచానూరు: యోగిమల్లవరం మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన విద్యాకిట్లను సోమవారం స్థానిక టీడీపీ నేతలు పంపిణీ చేశారు. నాయకులు హరిరామ్‌రెడ్డి, సాల్మాన్‌రాజు, పెరుమాల్, ఎలిజిబిత్, మహేశ్వరి, జీవన్, హెచ్‌ఎం రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓబులశెట్టివారిపల్లె జడ్పీహైస్కూల్‌లో.. - అచ్చమ్మ అగ్రహారం ఎంపీపీ మోడల్‌స్కూల్‌లో..

పాకాల: ఓబులశెట్టివారిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ దామోదరం, ఎంఈవో లింగయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీసుధ చేతులమీదుగా పంపిణీ చేశారు. చిన్నగోర్పాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మాజీ ఎంపీటీసీ ఆర్.నాని, టీడీపీ నాయకులు విశ్వనాథనాయుడు, చక్రవర్తి, గిరి, యుగంధర్ చౌదరి, విజయకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఎం.ప్రభుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అచ్చమ్మ అగ్రహారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ చెంగల్రాయులు, టీడీపీ నాయకులు బొల్లినేని మహేష్ కుమార్, లక్ష్మీపతినాయుడు, జగదీష్, శివాజీ, పాఠశాల కమిటీ చైర్మెన్ శ్రీదేవి, హెచ్‌ఎం జార్జి చేతులమీదుగా పంపిణీ చేశారు.

వేగంగా శెట్టిపల్లె రోడ్డు నిర్మాణ పనులు



మంగళం, జూన్ 24: మంగళం ఆర్టీవో కార్యాలయ కూడలి నుంచి శెట్టిపల్లె రైల్వేగేటు వరకు నిర్మించ తలపెట్టిన 80 అడుగుల రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.15.12కోట్ల టీటీడీ నిధులతో పనులు చేపట్టారు. తెలుగుగంగ లీకేజీల కారణంగా ఇన్నాళ్లూ ఆలస్యంగా పనులు కొనసాగాయి. ప్రస్తుతం పనుల్లో వేగం పెరగడంతో ఈ మార్గం గుండా వెళ్లే పాదచారులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నవీన్‌కుమార్‌రెడ్డిపై టీటీడీ క్రిమినల్ కేసు కొట్టివేత

తిరుపతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పలు అంశాలకు సంబంధించి విచారణ జరపాలని సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డిపై టీటీడీ పెట్టిన క్రిమినల్ కేసును తాజాగా హైకోర్టు కొట్టివేసింది.కొవిడ్ సంక్షోభ సమయంలో టీటీడీ తీసుకున్న కొన్ని నిర్ణయాలను ఆక్షేపిస్తూ నవీన్‌కుమార్‌రెడ్డి 2021 జూలై 2న సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టారు. అందులో ఆయన కొవిడ్ కారణంగా భక్తుల రద్దీ, ఆదాయం తగ్గిన నేపథ్యంలో బ్యాంకుల ద్వారా నడిచే లడ్డూ కౌంటర్లను రూ. 5 కోట్ల ఖర్చుతో కేవీఎం ఇన్ఫోకామ్ సంస్థకు ఎలా కట్టబెడతారని టీటీడీని ప్రశ్నించారు. లడ్డూ కౌంటర్, కళ్యాణ కట్ట, అలిపిరి, తిరుమల టోల్‌గేట్ చెకింగ్ పాయింట్ సహా సుమారు 17 ప్రాంతాల్లో 430 మంది సిబ్బందితో కేవీఎం ఏజెన్సీకి అప్పగించడంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ధర్మకర్తల మండలిని ప్రకటించాలని, స్పెసిఫైడ్ అథారిటీ అడ్డగోలు నిర్ణయాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. భక్తుల రద్దీ పెరిగే వరకూ వివిధ విభాగాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది, శ్రీవారి సేవకుల సేవలను లడ్డూ కౌంటర్లలో ఎందుకు వినియోగించుకోకూడదని ప్రశ్నించారు. కరోనాతో మల్టీ నేషనల్ కంపెనీలు సైతం తమ సంస్థలు కూడా దుబారా ఖర్చులను తగ్గించుకుంటున్నందున టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ ఎందుకు ఆ కోణంలో ఆలోచించడం లేదని ప్రశ్నించారు. టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీలో టీటీడీ ఈవో, దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్ సభ్యులుగా వుండాలని, కానీ దానికి విరుద్ధంగా నియమించారని ఆక్షేపించారు. కేవలం వారి పర్యవేక్షణలో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యే వరకూ అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే స్పెసిఫైడ్ అథారిటీ నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుందని గుర్తు చేశారు. టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ జాతీయ బ్యాంకు అధికారులతో చర్చించి గతంలో ఏ విధంగా లడ్డూ కౌంటర్లలో బ్యాంకు జీతాలతో అవుట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారో ఆలా చేసే ప్రయత్నం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. టీటీడీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచీ ప్రైవేటు ఏజెన్సీ వారు సెక్యూరిటీ డిపాజిట్‌ల పేరుతో లక్షల్లో వసూలు చేయడంపై విజిలెన్స్ విచారణ జరపాలని, నిరుద్యోగులు మోసపోకుండా చూడాలని ఆ పోస్టులో ప్రభుత్వాన్ని కోరారు.నవీన్ పోస్టుకు సంబంధించి టీటీడీ ఏమైనా లోటుపాట్లు వుంటే సరిదిద్దుకోవాల్సి వుండింది. అందులో వాస్తవం లేకపోతే ఖండించడం లేదా వివరణ ఇచ్చి వుంటే సరిపోయేది. అయితే అప్పటి టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి వివరణ ఇవ్వక పోగా టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా అవాస్తవ ఆరోపణలు చేశారని నవీన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.సంబంధిత పోస్టులో ఎలాంటి క్రిమినల్ స్వభావం లేకపోయినా తిరుమల టూ టౌన్ పోలీసులు నవీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీనిపై నవీన్ హైకోర్టును ఆశ్రయించి తనపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు. కేసు విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నవీన్ శ్రీవారి భక్తుడని, పాతికేళ్ళుగా టీటీడీ ప్రయోజనాల కోసం శ్రద్ధాసక్తుల తో పనిచేస్తున్నారనేందుకు ఆధారాలున్నాయని పేర్కొంది. టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశమేదీ ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులో కనిపించలేదని పేర్కొంది. ఇలాంటి ఫిర్యాదు వచ్చినపుడు క్రిమినల్ కేసు నమోదు చేయకుండా కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయాల్సిందిగా పోలీసులు ఫిర్యాదుదారుకు సూచించాలి తప్ప నేరుగా తామే క్రిమినల్ కేసు నమోదు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంలో సంబంధిత తిరుపతి కోర్టు కూడా సక్రమంగా వ్యవహరించలేదని ఆక్షేపించింది. నవీన్‌పై నమోదు చేసిన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ గత నెల 10వ తేదీన తీర్పు వెలువరించింది. అయితే కోర్టుకు వేసవి సెలవుల కారణంగా తీర్పు ప్రతి నవీన్‌కు ఆలస్యంగా అందింది.

'ఈహెచ్‌ఎస్' సమస్యలు పరిష్కరించండి: ఆపస్


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆపస్ నేతలు

తిరుపతి(విద్య), జూన్ 24: ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ (ఈహెచ్‌ఎస్)కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తిరుపతికి చెందిన ఆపస్ నేతలు కోరారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ని సోమవారం విజయవాడలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈహెచ్‌ఎస్ ట్రీట్‌మెంట్‌కు కొన్ని ఆస్పత్రులు అనుమతించడం లేదని తెలిపారు. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌ను చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోని ప్రధాన ఆస్పత్రుల్లోనూ కల్పించాలన్నారు. 45 ఏళ్ల దాటిన ఉద్యోగులకు ప్రతి ఏడాదీ మాస్టర్ హెల్త్ చెకప్ చేసుకునేలా అవకాశం కల్పించాలని, రోగి అడ్మిట్ అయిన 12 గంటల్లోపు అనుమతి వచ్చేలా చూడాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో.. రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి జీవీ సత్యన్నారాయణ, సంఘటన కార్యదర్శి పీహెచ్ శ్రావణ్‌కుమార్, కోశాధికారి ఎం.సురేష్‌కుమార్, కృష్ణాజిల్లా అధ్యక్షులు రఘునాథ్ ఉన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



తిరుపతి అర్బన్, జూన్ 24: యూనిమోని ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ సోమవారం పలువురు పేద విద్యార్థులకు చేయూతనిచ్చింది. ఎయిర్ బైపాస్‌రోడ్డులో నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా తమ సంస్థను ఆశ్రయించిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ లక్కీడ్రా తీశారు. ఇందులో తిరుపతికి చెందిన నక్కా సాయిమానిశాంత్‌కు రెండో బహుమతిగా రూ.1.5లక్షలు అందజేశారు. అలాగే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 15మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులను వితరణ చేసినట్లు సంస్థ సీఈవో సి.ఎ.కృష్ణన్ తెలిపారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డి భజన బృందాన్ని సాగనంపండి: బీజేపీ


మీడియాతో మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూన్ 24: 'తిరుమల కొండపై ధర్మం దారి తప్పడానికి ప్రధాన కారణం సుదీర్ఘకాలంగా అక్కడ వివిధ శాఖల్లో తిష్ఠవేసి గత టీటీడీ ఈవో ధర్మారెడ్డికి వంత పాడిన కొందరు అధికారులే. వీరందరినీ కొండపైనుంచి సాగనంపాలి' అని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి శ్రీవారి భక్తులతో మమేకమై క్యూకాంప్లెక్సు, అన్నదానం, ఇతర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు, వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తుండటం సంతోషకరమన్నారు. తిరుమలలో ధర్మారెడ్డి హయాంలో జరిగిన అవతవకలపై విచారణ జరిపి.. నిజాలను వెలికి తీయాలన్నారు. అదేవిధంగా క్విడ్ ప్రోకోపైనా.. టీటీడీ ప్రధాన గణాంక అధికారి బాలాజీపై కూడా విచారణ కమిటీ వేసి వాస్తవాలను వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న, రమేష్, మహేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు


లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవినాయుడు, శ్రీవారి ప్రతిమ అందజేస్తున్న ఆనంద్‌గౌడ్, ప్రసాదాలు అందజేస్తున్న రుద్రకోటి సదాశివం

తిరుపతి (జీవకోన/విశ్వవిద్యాలయాలు), జూన్ 24: రాష్ట్ర సచివాలయంలో ఐటీ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు సోమవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ● అలాగే మంత్రికి శ్రీవారి ప్రతిమను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ అందజేసి, అభినందనలు తెలిపారు. ● లోకేశ్‌కి తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు రుద్ర కోటి సదాశివం శాలువాకప్పి, శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- ఐదు దుంగల స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 24: అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలోని తుమ్మల బైలు అటవీప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐదు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం ఆదివారం సాయంత్రం నుంచి అన్నమయ్య జిల్లా రాజంపేట తుమ్మలబైలు సెక్షన్ వద్ద కూంబింగ్ చేపట్టారు. సోమవారం బట్టేడుకోన పుట్టంగి మడుగు మీదుగా వలసలు వైపు వెళుతుండగా ఆప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకెళ్లడం గమనించి చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. వారు దుంగలను పడేసి పారిపోతుండగా వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. విచారించగా.. తమిళనాడు వేలూరుజిల్లా చెందిన పొన్నుస్వామి రాజీ, ప్రభు వెల్లియన్‌గా గుర్తించారు. మరికొందరు స్మగ్లర్లు అడవిలో ఉన్నట్లుగా పట్టుబడ్డవారు సమాచారం ఇచ్చారు. వారి కోసం ముమ్మరంగా గాలింపుచర్యలు చేపట్టనున్నారు. ఈ ఘటనకు సంబంధించి తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి.. ఎస్ఐ రఫీ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'కబ్జాదారుల నుంచి మా ఇంటిని కాపాడండి'



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న జయరామిరెడ్డి, వెంకటసుబ్బమ్మ

తిరుపతి (జీవకోన), జూన్ 24: కబ్జాదారుల నుంచి తమ ఇంటిని కాపాడాలని సంజయ్‌గాంధీకాలనీకి చెందిన వెంకటసుబ్బమ్మ, జయరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు తమ కుటుంబీకులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. వారి మాటల్లోనే.. 'సంజయ్ గాంధీ కాలనీలోని 2-5-746/3 నెంబరు ఇంట్లో మా కుటుంబం నివసిస్తోంది. సుమారు 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటూ.. కార్పొరేషన్‌కు అన్నిరకాల పన్నులు చెల్లిస్తున్నాం. 1991లో యాలమూరి శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు దౌర్జన్యం చేసి మా స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. 1996లో మావైపు కోర్టు తీర్పు వచ్చింది. 2000 సంవత్సరంలో టి.రాజేశ్వరి మా ఇంటి స్థలాన్ని కాజేయడానికి తప్పుడు పత్రాలతో కోర్టుకు వెళ్లగా అప్పుడూ మావైపే తీర్పు వచ్చింది. తాజాగా మా ఇంటిని మరమ్మతు చేసుకునే సమయంలో టి.గోపీకృష్ణ అనే వ్యక్తి వచ్చి దౌర్జన్యం చేస్తూ.. దాడులకు పాల్పడుతున్నాడు. ఎస్పీకి ఫిర్యాదు చేస్తే సీఐకి ఆదేశాలు జారీ చేశారు. ఆయనేమో పట్టించుకోవడం లేదు. పైగా ఆక్రమణదారులతో పోలీసులు కుమ్మక్కై తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. పోలీసు, ఉన్నతస్థాయి అధికారులు, స్పందించి మాకు న్యాయం చేయాలి' అని బాధితులు విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67 కోట్లు

తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,455 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,251 మంది తలనీలాలు సమర్పించారు.

వాహనం ఢీకొని పాదచారి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 24: లీలామహల్ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. అలిపిరి సీఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. శివజ్యోతి నగర్‌కు చెందిన ఎస్.గురప్ప ఆదివారం అర్ధరాత్రి ఇంటి వద్ద నుంచి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుమారుడు గిరిబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక బంధువులకు అప్పగించారు.

హత్య కేసులో నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 24: ఆటోనగర్ వద్ద ఈ నెల 14వ తేదీన జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను అలిపిరి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. చంద్రగిరి మండలం ముంగిళిపట్టుకు చెందిన మాధం ప్రసాద్ ఆటోనగర్‌లోని తన స్నేహితుడిని కలిసి ఇంటికి బయల్దేరాడు. ఆటోనగర్ రోడ్డుపై మద్యం తాగుతున్న కొందరు స్నేహితుల వద్దకెళ్లాడు. అందరూ మద్యం మత్తులో ఉండటంతో వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో ప్రసాద్‌ను కత్తితో దారుణంగా హత్య చేశారు. కేసు నమోదు చేసిన అలిపిరి సీఐ రామారావు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం నిందితులైన ఆటోనగర్‌కు చెందిన కచ్చిలేటి వెంకటేష్, తమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన నీలకంఠం, చైతన్యపురానికి చెందిన సుంకర కిరణ్‌కుమార్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. మరో నిందితుడు మైనర్ కావడంతో అతడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

కుప్పం డిపోకు 9 ఆర్టీసీ బస్సుల తరలింపు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 24: కుప్పం ఆర్టీసీ డిపోకు తిరుమల, అలిపిరి డిపోల నుంచి తొమ్మిది బస్సులు ఆదివారం రాత్రి తరలించారు. గతంలో ప్రయాణికుల అవసరాల అనుగుణంగా ఈ బస్సులను కుప్పం డిపో నుంచే రప్పించారు. అవి తిరిగే (తిరుమల-కృష్ణగిరి) మార్గాలు, సమయాలను యథావిధిగా ఉంచి డిపోల పేర్లను మాత్రమే మార్చారు. అంటే తిరుమల-తిరుపతి మధ్య ఓ ట్రిప్పు తిరిగాక కృష్ణగిరికి వెళ్లివచ్చేవి. ప్రస్తుతానికి ఎలక్ట్రిక్ బస్సులు విరివిగా అందుబాటులో ఉండడంతో కొన్ని డీజల్ బస్సుల రాబడి కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో అధికారులు చర్యలు చేపట్టి యథాస్థానానికి ఆ తొమ్మిది బస్సులను తరలించారు. అదే సమయంలో భక్తులకు కొరత లేకుండా తిరుపతి డిపో నుంచి రెండు బస్సులు తిరుమల డిపోకు కేటాయించారు. ఇవి తిరుమల-తిరుపతి మధ్య నడుస్తాయి. తిరుమల, తిరుపతి, అలిపిరి, మంగళం డిపోల్లో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లకు కుప్పం డిపోకు మారేందుకు అవకాశం కల్పించారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

మహిళా వర్సిటీకి రూ.19లక్షల మంజూరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 24: పద్మావతి మహిళా యూనివర్సిటీకి రూ.19 లక్షల నిధులు మంజూరయ్యాయి. వర్సిటీలోని లైవ్లీహుడ్ బిజినెస్ ఇన్‌క్యూబేటర్‌కు కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ నుంచి ఈ నిధులు కేటాయించారు. దీనిపై వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జీవనజ్యోతి హర్షం వ్యక్తం చేశారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు వీసీ సూచించారు. వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఉద్యోగ నైపుణ్యాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె ప్రసంగించారు. పలు అంశాలపై నిపుణులు రజని, సౌమ్య అవగాహన కల్పించారు. హెచ్‌వోడీ ఉషారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీఆర్ సెట్ ఇంటర్వ్యూలు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 24: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్ సెట్‌కు సంబంధించిన ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. హోంసైన్స్, మ్యూజిక్ విభాగాల పరిధిలో పీహెచ్‌డీ ప్రవేశానికి పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఇంటర్వ్యూలను వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని పర్యవేక్షించారు. 27, 28 తేదీల్లో లా, ఉమెన్ స్టడీస్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

11న ఎస్వీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 24: ఎస్వీ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు జూలై 11వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి రఫీ షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. ఎన్నికలు నిర్వహించిన రోజే ఫలితాలు విడుదల చేయాలని భావిస్తున్నారు.

అన్న క్యాంటీన్లు త్వరగా తెరిపించండి

కమిషనర్‌కి వినతిపత్రమిచ్చిన టీడీపీ నాయకులు ● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెల్లువెత్తిన అర్జీలు


అదితిసింగ్‌కి వినతిపత్రం అందజేస్తున్న సుగుణమ్మ, తదితరులు

తిరుపతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో అన్న క్యాంటీన్లను త్వరగా తెరిపించాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో టీడీపీ నాయకులతో కలిసి మేయర్ శిరీష సమక్షంలో కమిషనర్ అదితిసింగ్‌కి వినతిపత్రం అందజేశారు. అలాగే రద్దీ ఉన్న ప్రాంతాల్లో అదనంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ వారంలోపు అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం సిద్ధం చేయిస్తామన్నారు. కర్నాలవీధి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కస్తూరి బాయి సందు, పల్లివీధికి వెళ్లే వంతెన నిర్మించేలా నిర్ణయించడం జరిగినా పనులు ప్రారంభించలేదని కార్పొరేటర్ నరసింహాచారి తెలిపారు. కైకాల చెరువు వద్ద బోరు పని చేయడం లేదని, తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, కొత్తపల్లి, తిమ్మినాయుడు పాళెం రెసిడెన్షియల్ అసోసియేషన్ వారు అర్జీ ఇచ్చి తమ ప్రాంత సమస్యలు పరిష్కరించాలన్నారు. చెన్నారెడ్డి కాలనీలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు నీటి సమస్య ఉందని, ట్యాంకర్ ద్వారా రోజూ నీటిని పంపాలని, సెహ్రా నగర్లో మూడు నెలలుగా తెలుగు గంగ రావడం లేదని, తిమ్మినాయుడు పాళెం శ్మశానంలో సదుపాయాలు కల్పించాలని, కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు వెల్లువెత్తాయి. అన్నింటినీ పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ తిరుమాలిక మోహన్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, టీడీపీ నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసుల నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


చాముండేశ్వరీనాథ్

తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, ఆర్‌వీఎస్‌కెకె రంగారావు, బొగ్గు రమణమూర్తి, తెలంగాణ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ సుంకరి రాజు, క్రికెటర్, ఏసీఏ మాజీ ఛైర్మన్ చాముండేశ్వరీనాథ్ ఉన్నారు. దర్శనం అనంతరం చాముండేశ్వరీనాథ్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. టీ20 వరల్డ్‌కప్ ట్రోఫీ ఇండియానే కొట్టే ఛాన్స్ ఉందన్నారు.

రాష్ట్రం బాగుపడేలా కష్టపడి పనిచేస్తాం

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన రాష్ట్రం రానున్న రోజుల్లో కోలుకోవాలని, ప్రజల తీర్పును గౌరవిస్తూ రాష్ట్రం బాగుపడేలా కూటమి ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా కష్టపడి పనిచేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. కాలినడకన సోమవారం తిరుమలకు చేరుకున్న ఆమె ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం మన బతుకులు మారాలంటే చంద్రబాబే సీఎం కావాలనే ఆలోచనతో ప్రజలు మంచి తీర్పునిచ్చారన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెట్టే ఏ కార్యక్రమం చేయదన్నారు.

పార్కు స్థలం ఆక్రమణలపై పరిశీలన

తిరుపతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సుబ్బారెడ్డినగర్ సమీపంలోని సాయి విష్ణు లేఅవుట్‌లోని తుడాకు కేటాయించిన పార్కు స్థలం ఆక్రమణలను సోమవారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పరిశీలించారు. లేఅవుట్‌లోని 650 ప్లాట్లలో 9 ఎకరాలు పార్క్‌కు ఇస్తే దానిలో 5 ఎకరాలు కబ్జా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణాలను తొలగించేలా తుడా అధికారులకు సూచనలు చేస్తామన్నారు. అదేవిధంగా అక్కడున్న కాలువపై రోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులకు చెప్పారు.

'పీఎస్4'లో మరోసారి అధికారుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న అధికారులు

తిరుపతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీఎస్4 హోటల్లో నగరపాలక సంస్థ, ఫుడ్ సేఫ్టీ అధికారులు కమిషనర్ అదితి సింగ్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం మరోమారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యువఅన్వేష్ మాట్లాడుతూ.. తిరుమల బైపాస్ రోడ్డులోని పీఎస్4పై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈనెల 20వ తేదీన తనిఖీ చేసి.. సీజ్ చేశామని చెప్పారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను సరిదిద్దుకోవాల్సిందిగా నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఆ లోపాలను సరిదిద్ది తిరిగి హోటల్ తెరవడానికి అనుమతి కోసం సోమవారం కమిషనర్‌ను కోరారని వివరించారు. దాంతో సాయంత్రం తమ సిబ్బందితోపాటు, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిలేటితో కలిసి హోటల్‌ను తనిఖీ చేశామన్నారు. నిర్వాహకులకు మరికొన్ని సూచనలు చేశామని వివరించారు. ఇక జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హోటల్లో తీసిన ఆహార పదార్థాలు శాంపిల్స్ హైదరాబాదు నాచారం ల్యాబ్‌కి వెళ్లాయన్నారు. మూడు వారాల్లోపు రిపోర్ట్స్ వస్తాయని, అందులో ఏమైనా లోపాలుంటే వారిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కోర్టులో కేసు వేస్తారని స్పష్టం చేశారు. ఆయనవెంట శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి ఉన్నారు.

ఫుడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేస్తాం

నగరపాలక సంస్థ, ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ సిబ్బందితో కలిసి ఫుడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని యువఅన్వేష్ తెలిపారు. అలాగే నగరంలో తనిఖీలు ముమ్మరం చేస్తామని చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'నీట్' విద్యార్థులకు న్యాయం చేయండి: పీడీఎస్‌వో



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), జూన్ 24: నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (పీడీఎస్‌వో) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఎంఆర్‌పల్లె కూడలిలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపింది. జిల్లా కార్యదర్శి ఆర్.ఆశ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు కేంద్రప్రభుత్వందే బాధ్యతన్నారు. కాగా.. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ఎస్వీ ఐటీఐ కళాశాలలో నివాళి అర్పించారు. నాయకులు త్రివేణి, సుచిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంపై ఈవో సమీక్ష


సిబ్బందికి సూచనలిస్తున్న శ్యామలరావు

తిరుమల, జూన్ 24 (ఆంధ్ర జ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, చరిత్ర, వాస్తుశిల్పం, విశిష్టత వంటి అంశాలపై టీటీడీ ఈవో శ్యామలరావు సమీక్షించారు. సోమవారం సాయంత్రం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి వివిధ విభాగాల అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శ్రీవారి ఆలయ చరిత్ర, వైఖానస ఆగమ, జీయంగారి వ్యవస్థ, వివిధ ఆచార వ్యవహారాలు, నిత్య, వార, మాస, వార్షిక సేవా కార్యక్రమంలు, సుప్రభాతం నుంచి ఏకాంతం వరకు ప్రతిరోజు శ్రీవారికి నిర్వహించే వివిధ కైంకర్యాలను అధికారులు తెలియజేశారు. తర్వాత ఆర్జిత సేవలు, వీఐపీ, సర్వ, ఇతర దర్శనాలపైనా సమీక్షించారు. ఏ దర్శనానికి ఎంత సమయం పడుతుందో సమగ్రంగా తనకు నివేదిక ఇవ్వాలని ఆలయ డిప్యూటీఈవో లోకనాథంను ఆదేశించారు.

క్యూలైన్లలో ఈవో తనిఖీలు

సమీక్షకు ముందు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్యూలైన్లను ఈవో పరిశీలించారు. నారాయణగిరి షెడ్లను పరిశీలించి.. సిబ్బందికి సూచనలిచ్చారు. జేఈవోలతోపాటు సీవీఎస్వో నరసింహకిషోర్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్, టీటీడీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపిస్తాం

వైసీపీ కార్యాలయాల పేరుతో ప్రజాధనం లూటీ : టీడీపీ నేతల ఆగ్రహం


ప్లకార్డులతో టీడీపీ నాయకులు

తిరుపతి (జీవకోన), జూన్ 24: తిరుపతి కార్పొరేషన్, టీటీడీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపిస్తాం. వైసీపీ కార్యాలయాల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేశారు' అని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ.. టీడీఆర్ బాండ్లు, మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో వైసీపీ ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్నారు. వీటిపై విచారణ జరిపించేలా కూటమిలోని అన్ని పార్టీలు కలిసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. చంద్రగిరి కోటను తలదన్నేలా వైసీపీ కార్యాలయాలను నిర్మించారన్నారు. రాంకీ కన్‌స్ట్రక్షన్ సంస్థ నుంచి వైసీపీకి పెద్దఎత్తున ముడుపులు పార్టీ కార్యాలయాల నిర్మాణాల రూపంలో వచ్చాయన్నారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ.. మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో కొంతమంది కార్పొరేటర్లు ఇతరుల స్థలాలను దౌర్జన్యంగా లాక్కున్నారన్నారు. మరికొందరు కార్పొరేటర్లు అప్రూవల్ లేకుండా పెద్దపెద్ద భవంతులు నిర్మించారని చెప్పారు. వీటన్నింటినీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు. నేతలు ఊకా విజయకుమార్, ఊట్ల సురేంద్రనాయుడు మాట్లాడుతూ.. జగన్‌కు ప్యాలెస్ పిచ్చి పట్టిందని, పార్టీ కార్యాలయాలను కూడా ప్యాలెస్ల వలె నిర్మించుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అక్రమంగా నిర్మించిన భవంతులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని.. ఆస్పత్రులకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.సమావేశంలో నాయకులు రవి మనోహరాచారి, యశ్వంత్‌రెడ్డి, ఎస్‌పీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

వైద్యం అందించాల్సిన చేతితో....

తండ్రి చితికి నిప్పంటించిన తనయ


తండ్రి చితికి నిప్పంటిస్తున్న సాయిబిందు

నాయుడుపేట టౌన్, జూన్ 24: వైద్యం అందించాల్సిన చేతితో తండ్రి చితికి నిప్పంటించింది ఓ మెడిసిన్ విద్యార్థిని. నాయుడుపేట పట్టణంలోని రామకృష్ణాపురంలో నివాసం ఉంటున్న రామకృష్ణారెడ్డి (63) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సాయిబిందు జార్జీయాలో వైద్యవిద్య చివరి సంవత్సరం చదువుతోంది. రెండో కుమార్తె బీటెక్ పూర్తి చేసింది. ఈ క్రమంలో తండ్రి మరణ వార్తను సాయిబిందుకు కుటుంబ సభ్యులు తెలిపారు. జార్జీయాలో ఉన్న సాయిబిందు నాయుడుపేటకు సోమవారం మధ్యాహ్నం చేరుకుంది. అనంతరం తండ్రి దహన క్రియలను దగ్గరుండి నిర్వహించింది. డాక్టర్‌గా తండ్రికి సేవలు అందించాల్సిన తాను చితికి నిప్పు పెట్టాల్సిన పరిస్థితి రావడంపై విలపించింది. కుటుంబసభ్యులు ఓదార్చి దహనక్రియలను పూర్తి చేయించారు.

టెన్త్‌లో ప్రతిభావంతులకు నగదు పురస్కారం



నాయుడుపేట, జూన్ 24: మండలంలోని అన్నమేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సోమవారం నగదు పురస్కారాన్ని అందజేశారు. 600కు 569 మార్కులు సాధించిన ఝాన్సీకి రూ.5వేలు, అస్మిత(557)కు రూ.3వేలు, యామిని(551)కి రూ.2వేలు, 500 మార్కులు దాటిన 8 మంది విద్యార్థులకు తలా రూ.వెయ్యిని పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రావు, సర్పంచ్ జ్యోతి, ఎంపీపీ మధు, విద్యాకమిటీ సభ్యుడు సుబ్రహ్మణ్యం, చిగురవాడ పద్మనాభం, కుమారస్వామిరెడ్డి అందజేశారు. గణితంలో 100 మార్కులు సాధించిన ఝాన్సీకి రూ.2వేలును గణిత ఉపాధ్యాయుడు చక్రవర్తి, సాంఘిక శాస్త్రంలో 99 మార్కులు సాధించిన శ్రావణ్‌కుమార్‌కు రూ.2వేలను ఉపాధ్యాయురాలు రేణుక అందజేశారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం


అవగాహన కల్పిస్తున్న అరుణకుమారి

నాయుడుపేట, జూన్ 24: డ్రగ్స్ వినియోగంతో అనేక రుగ్మతలు రావడంతోపాటు వారి జీవితాలు, కుటుంబాలు నాశనమవుతాయని నాయుడు పేట సర్కిల్ సెబ్ సీఐ అరుణ కుమారి అన్నారు. పట్టణంలోని శ్రీవేమ జూనియర్ కళాశాలలో సోమవారం వరల్డ్ యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగంతో విచక్షణ కోల్పోతారన్నారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, శ్రీవేమ విద్యాసంస్థల అధినేత టి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అతిసార నిర్మూలనకు పటిష్ఠ చర్యలు

నాయుడుపేట, జూన్ 24: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అతిసార ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి ఆదేశించారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 13 సచివాలయాల సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కలెక్టర్ ఆదేశాల మేరకు 5 సంవత్సరాల పిల్లలకు ముందస్తుగా ఓఆర్‌ఎస్, జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. ప్రతి ఒక్కరు చేతులను, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షిత నీరు తాగాలని అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పబ్లిక్ టాయిలెట్లను ప్రతి రోజు శుభ్రపరచాల్సి ఉందన్నారు.

గురుకులాలను పారదర్శకంగా నిర్వహించండి

● ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, జూన్ 24: గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యాభ్యాసం, మౌలిక సదుపాయాలను నాణ్యతా ప్రమాణాలతోపాటు పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదేశించారు. నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆమె సమీక్షించారు. గురుకులాల్లో విద్యార్థుల సంఖ్య, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఆమేరకు పని చేయాలన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

పనులు ఆపాలని చెప్పినా కట్టేశారు!

తిరుపతి జిల్లా వైసీపీ భవన నిర్మాణంపై ఏపీఐఐసీ వివరణ

తిరుపతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కుర్రకాల్వ గ్రామ పరిధిలో వైసీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులు ఆపాలని చెప్పినా నిలపకుండా నిర్మాణం పూర్తి చేసేశారని ఏపీఐఐసీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2007లో ఐటీ పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీ కుర్రకాల్వ గ్రామంలో 217, 218 తదితర సర్వే నంబర్లలోని 147.90 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచీ సేకరించిందని అందులో పేర్కొంది. ఆ భూమిని అభివృద్ధి చేసి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలకు కేటాయించడం జరిగిందని తెలిపింది.2022 డిసెంబరు 20న ప్రభుత్వం 219-15, 219-16 సర్వే నంబర్లలోని రెండెకరాల భూమిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించిందని తెలిపింది. 33 ఏళ్ల కాలపరిమితితో ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు ప్రాతిపదికపై ఈ కేటాయింపు జరిగిందని వివరించింది.ఆ భూమిలో పార్టీ కార్యాలయ భవన నిర్మాణం మొదలు పెట్టిన తర్వాత ఆ స్థలం ఏపీఐఐసీ-ఐఏఎల్‌ఏ పరిధిలో వున్నందున సంబంధిత ఓబీపీఎంఎస్ పోర్టల్ ద్వారా గతేడాది సెప్టెంబరు 29న అనుమతి కోసం దరఖాస్తు అందిందని తెలిపింది. ఆ దరఖాస్తును పరిశీలించిన ఐలా కార్యనిర్వహణాధికారి దరఖాస్తులోని లోపాలను తెలియజేసి, చెల్లించాల్సిన మిగులు రుసుమును సూచించడంతో పాటు తక్షణం నిర్మాణ పనులను నిలిపివేయాల్సిందిగా గతేడాది అక్టోబరు 4వ తేదీన ఆన్‌లైన్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించింది. అయినా భవన నిర్మాణ పనులు ఆపకుండా పూర్తి చేశారని తెలిపింది. సంబంధిత స్థలంలో నిర్మాణ బాధ్యత నిర్వహిస్తున్న వారికి పనులు ఆపాలని మౌఖికంగా తెలియజేయడంతో పాటు ఆ మేరకు భవన గోడలకు నోటీసులు కూడా అంటించడం జరిగిందని తెలిపింది.

కుప్పం డిపోకు 9 ఆర్టీసీ బస్సుల తరలింపు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 24: కుప్పం ఆర్టీసీ డిపోకు తిరుమల, అలిపిరి డిపోల నుంచి తొమ్మిది బస్సులు ఆదివారం రాత్రి తరలించారు. గతంలో ప్రయాణికుల అవసరాల అనుగుణంగా ఈ బస్సులను కుప్పం డిపో నుంచే రప్పించారు. అవి తిరిగే (తిరుమల-కృష్ణగిరి) మార్గాలు, సమయాలను యథావిధిగా ఉంచి డిపోల పేర్లను మాత్రమే మార్చారు. అంటే తిరుమల-తిరుపతి మధ్య ఓ ట్రిప్పు తిరిగాక కృష్ణగిరికి వెళ్లివచ్చేవి. ప్రస్తుతానికి ఎలక్ట్రిక్ బస్సులు విరివిగా అందుబాటులో ఉండడంతో కొన్ని డీజిల్ బస్సుల రాబడి కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో అధికారులు చర్యలు చేపట్టి యథాస్థానానికి ఆ తొమ్మిది బస్సులను తరలించారు. అదే సమయంలో భక్తులకు కొరత లేకుండా తిరుపతి డిపో నుంచి రెండు బస్సులు తిరుమల డిపోకు కేటాయించారు. ఇవి తిరుమల-తిరుపతి మధ్య నడుస్తాయి. అలాగే తిరుమల, తిరుపతి, అలిపిరి, మంగళం డిపోల్లో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లకు కుప్పం డిపోకు మారేందుకు కూడా అవకాశం కల్పించారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

కణితి మాంసం స్వాధీనం

ఇద్దరి అరెస్టు, నాటు తుపాకి, బైక్ సీజ్

భాకరాపేట, జూన్ 24: కణితి మాంసం తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కణితి మాంసంతోపాటు నాటు తుపాకి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. భాకరాపేట ఫారెస్టు రేంజర్ దత్తాత్రేయ తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె షికారీ కాలనీకి చెందిన సురేశ్, శ్రీనివాసులు నాటు తుపాకీతో కణితిని కాల్చి మాంసం తీసుకొస్తుండగా భాకరాపేట బీట్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండుకు పంపారు. ఈ దాడుల్లో ఎఫ్‌ఎస్‌వో తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు సదాశివయ్య, లోకనాథం పాల్గొన్నారన్నారు.

రద్దైన ఆర్టీసీ సర్వీసులు... ఇబ్బందుల్లో ప్రయాణికులు

● ప్రైవేటు వాహనాలను

ఆశ్రయిస్తున్న గ్రామీణులు

వెంకటగిరి, జూన్ 24 : ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని ఆర్టీసీ అధికారులే సభలు, సమావేశాలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. అయితే ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపకపోవం విమర్శలకు తావిస్తోంది. వెంకటగిరి ఆర్టీసీ డిపో పరిధిలో ఇటీవల పెద్ద ఎత్తున సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

వెంకటగిరిలో 1987లో ఆర్టీసీ డిపో ప్రారంభించినప్పుడు 80 బస్సులు అందుబాటులో ఉంచారు. కాలక్రమేణా బస్సు సర్వీసులు పెంచాల్సింది పోయి గణనీయంగా తగ్గించేయడంతో ప్రయాణీలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం 38 ఆర్టీసీ బస్సులు, 21 హైర్ బస్సులు నడుస్తుండగా వీటిలో ఇటీవల 9 హైర్ బస్సు సర్వీసులను రద్దు చేయడంతో గ్రామీణులకు కష్టాలు మొదలయ్యాయి. గతంలో వెంకటగిరి- నెల్లూరు మధ్య 10 సర్వీసులు తిరిగేవి. ప్రస్తుతం 6 బస్సులు మాత్రమే తిప్పుతున్నారు. ఇదేవిధంగా వెంకటగిరి - తిరుపతి మధ్య నాలుగు బస్సులు రద్దు చేయడంతో ప్రస్తుతం ఆరు సర్వీసులే నడుస్తున్నాయి. జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం ప్రజలు వెళ్తుంటారు. చాలినన్ని బస్సులు నడపకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. తిరుమలకు వెళ్లే బస్సులు కూడా నిలిపి వేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వెంకటగిరి, కడప నుంచి ప్రతి రోజు చెన్నైకి వెళ్లేఆర్టీసీ బస్సులను రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. ఒక్క సారిగా బస్సులు రద్దు చేయడంపై ప్రయాణికులు ఆర్‌ఎంకు ఫిర్యాదు చేయడంతో తాత్కాలికంగా 8 బస్సులు తిప్పుతున్నారు. ఇక వెంకటగిరి - శ్రీకాళహస్తి, వెంకటగిరి - నాయుడుపేట మధ్య కూడా చాలినన్ని బస్సులు నడపడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మంగళం..

ఇక గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సేవలు పూర్తిగా మంగళం పాడారన్న విమర్శలున్నాయి. దీంతో గ్రామీణ ప్రజలుకు ఆటోలు, ప్యాసింజర్ వాహనాలే దిక్కయ్యాయి. వెంకటగిరి నుంచి మోపూరుకు ఉదయం మాత్రమే ఆర్టీసీ బస్సు వస్తుందని సాయంత్రం రాకపోవడంతో స్కూళ్లకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం ఆటోలను ఆశ్రయిస్తున్నారు. డిపో మేనేజరు వైఫల్యం కారణంగా వెంకటగిరిలో ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ జిల్లా స్థాయి అధికారులు ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.


ఖాళీగా ఉన్న వెంకటగిరి ఆర్టీసీ డిపో ప్రాంగణం

ఆక్రమణల చెరలో ఆర్‌అండ్‌బీ స్థలం




రైల్వే స్టేషన్ ప్రాంతంలో చదును చేసిన ఆర్‌అండ్‌బీ స్థలం

నాయుడుపేట, జూన్ 24: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ఆర్‌అండ్‌బీ స్థలంలో వాణిజ్య ఆక్రమణలకు భూములను చదునుచేస్తూ ఆక్రమణలకు తెరదీశారు. గతంలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ స్థలాలు దర్జాగా ఆక్రమించి శాశ్వత కట్టడాలను ఏర్పరుచుకున్నారు. పట్టణంలోని దర్గావీధి, వెల్‌కం సెంటర్, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు ప్రాంతాల్లో మాత్రమే ఆక్రమణలను తొలగించారు. మిగిలిన చోట్ల కోట్ల రూపాయల ఆక్రమణలు యథావిధంగా ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ స్థలం చదును చేసి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు కానీ మున్సిపాలిటీ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. అలా విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

గూడూరులో ఎమ్మెల్యే సునీల్ విజయోత్సవ ర్యాలీ


ఆర్టీసీ బస్టాండు వద్ద కమలాపండ్ల మాలతో సునీల్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, జూన్ 24: తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన గూడూరు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని పాశిం సునీల్‌కుమార్ అన్నారు. అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం గూడూరుకు విచ్చేసిన సందర్భంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విఘ్నేశ్వరపురంలోని విఘ్నేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆయనకు కమలాపండ్ల మాలతో స్వాగతం పలికారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి రాజావీధి మీదుగా టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో అడుగడుగా నాయకులు, కార్యకర్తలు, స్థానికులు బాణసంచా పేల్చుతూ గజమాలలతో స్వాగతం పలికారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కక్షసాధింపు చర్యలకు పాల్పడమని అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. వైసీపీ పాలనలో వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారన్నారు. తన గెలుపుకు కారణమైన కొండేపాటి గంగాప్రసాద్, నానాజీతోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన, అన్ని వర్గాల ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, చాన్‌బాషా, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, కిషోర్‌నాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, చంద్రనీల్, నయూం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం: కురుగొండ్ల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 24: టీడీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు యేటా రూ.20 వేలు అందిస్తామని చెప్పారు. రైతులకు ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని చెప్పారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం తోపాటు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యాన్ని నిల్వచేసుకొని గిట్టుబాటు ధర వచ్చేవరకు భద్రపరిచేందుకు గోదాములు నిర్మిస్తామన్నారు. కూరగాయలు, ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనూజా రెడ్డి, టీడీపీ నాయకులు పవ్వు చంద్రమౌళిరెడ్డి, కెవీకే ప్రసాద్ నాయుడు, పి.విశ్వనాథనాయుడు, బి.రాజేశ్వరరావు, కె.శ్రీనివాసులు నాయుడు, పి.కోటేశ్వరరెడ్డి. ఏ.రామచంద్రయ్య నాయుడు సహా ఏడీఏ నాగార్జున సాగర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 24: వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ని చంద్రగిరి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబర ధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

సూర్యప్రభపై వెంకన్న విహారం



గూడూరు, జూన్ 24: పట్టణంలోని రాజావీధిలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టింప జేసి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67 కోట్లు

తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,455 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

నవీన్‌కుమార్‌రెడ్డిపై టీటీడీ క్రిమినల్ కేసు కొట్టివేత

తిరుపతి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పలు అంశాలకు సంబంధించి విచారణ జరపాలని సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డిపై టీటీడీ పెట్టిన క్రిమినల్ కేసును తాజాగా హైకోర్టు కొట్టివేసింది.కొవిడ్ సంక్షోభ సమయంలో టీటీడీ తీసుకున్న కొన్ని నిర్ణయాలను ఆక్షేపిస్తూ నవీన్‌కుమార్‌రెడ్డి 2021 జూలై 2న సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టు పెట్టారు. అందులో ఆయన కొవిడ్ కారణంగా భక్తుల రద్దీ, ఆదాయం తగ్గిన నేపథ్యంలో బ్యాంకుల ద్వారా నడిచే లడ్డూ కౌంటర్లను రూ. 5 కోట్ల ఖర్చుతో కేవీఎం ఇన్ఫోకామ్ సంస్థకు ఎలా కట్టబెడతారని టీటీడీని ప్రశ్నించారు. లడ్డూ కౌంటర్, కళ్యాణ కట్ట, అలిపిరి, తిరుమల టోల్‌గేట్ చెకింగ్ పాయింట్ సహా సుమారు 17 ప్రాంతాల్లో 430 మంది సిబ్బందితో కేవీఎం ఏజెన్సీకి అప్పగించడంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ధర్మకర్తల మండలిని ప్రకటించాలని, స్పెసిఫైడ్ అథారిటీ అడ్డగోలు నిర్ణయాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. భక్తుల రద్దీ పెరిగే వరకూ వివిధ విభాగాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్‌సిబ్బంది, శ్రీవారి సేవకుల సేవలను లడ్డూ కౌంటర్లలో ఎందుకు వినియోగించుకోకూడదని ప్రశ్నించారు. కరోనాతో మల్టీ నేషనల్ కంపెనీలు సైతం తమ సంస్థలు కూడా దుబారా ఖర్చులను తగ్గించుకుంటున్నందున టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ ఎందుకు ఆ కోణంలో ఆలోచించడం లేదని ప్రశ్నించారు. టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీలో టీటీడీ ఈవో, దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్ సభ్యులుగా వుండాలని, కానీ దానికి విరుద్ధంగా నియమించారని ఆక్షేపించారు. కేవలం వారి పర్యవేక్షణలో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యే వరకూ అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే స్పెసిఫైడ్ అథారిటీ నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుందని గుర్తు చేశారు. టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ జాతీయ బ్యాంకు అధికారులతో చర్చించి గతంలో ఏ విధంగా లడ్డూ కౌంటర్లలో బ్యాంకు జీతాలతో అవుట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారో అలా చేసే ప్రయత్నం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. టీటీడీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచీ ప్రైవేటు ఏజెన్సీ వారు సెక్యూరిటీ డిపాజిట్‌ల పేరుతో లక్షల్లో వసూలు చేయడంపై విజిలెన్స్ విచారణ జరపాలని, నిరుద్యోగులు మోసపోకుండా చూడాలని ఆ పోస్టులో ప్రభుత్వాన్ని కోరారు.నవీన్ పోస్టుకు సంబంధించి టీటీడీ ఏవైనా లోటుపాట్లు వుంటే సరిదిద్దుకోవాల్సి వుండింది. అందులో వాస్తవం లేకపోతే ఖండించడం లేదా వివరణ ఇచ్చి వుంటే సరిపోయేది. అయితే అప్పటి టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి వివరణ ఇవ్వకపోగా టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా అవాస్తవ ఆరోపణలు చేశారని నవీన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.సంబంధిత పోస్టులో ఎలాంటి క్రిమినల్ స్వభావం లేకపోయినా తిరుమల టూ టౌన్ పోలీసులు నవీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీనిపై నవీన్ హైకోర్టును ఆశ్రయించి తనపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు. కేసు విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నవీన్ శ్రీవారి భక్తుడని, పాతికేళ్ళుగా టీటీడీ ప్రయోజనాల కోసం శ్రద్ధాసక్తులతో పనిచేస్తున్నారనేందుకు ఆధారాలున్నాయని పేర్కొంది. టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశమేదీ ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులో కనిపించలేదని పేర్కొంది. ఇలాంటి ఫిర్యాదు వచ్చినపుడు క్రిమినల్ కేసు నమోదు చేయకుండా కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయాల్సిందిగా పోలీసులు ఫిర్యాదుదారుకు సూచించాలి తప్ప నేరుగా తామే క్రిమినల్ కేసు నమోదు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంలో సంబంధిత తిరుపతి కోర్టు కూడా సక్రమంగా వ్యవహరించలేదని ఆక్షేపించింది. నవీన్‌పై నమోదు చేసిన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ గత నెల 10వ తేదీన తీర్పు వెలువరించింది. అయితే కోర్టుకు వేసవి సెలవుల కారణంగా తీర్పు ప్రతి నవీన్‌కు ఆలస్యంగా అందింది.

చెన్నూరు ఎస్టీ గురుకులంలో తనిఖీలు


గురుకుల వంటశాలలో కూరగాయల పరిశీలనలో శ్రీహరి తదితరులు

గూడూరు అర్బన్, జూన్ 24: మండలంలోని చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలను సోమవారం డీఎంహెచ్‌వో శ్రీహరి తనిఖీ చేశారు. శనివారం మధ్యాహ్న భోజనం సందర్భంగా కలుషిత నీరు తాగి ఎస్టీ గురుకుల పాఠశాలలో 15మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. అస్వస్థతకు గల కారణాలను తెలుసుకునేందుకు డీఎంహెచ్‌వో సోమవారం గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాగునీటి నమూనాను పరీక్షకు పంపించామని, నివేదిక రావాల్సివుందన్నారు. అదేవిధంగా పిల్లలకు వడ్డించే ఆహార పదార్థాలను, కూరగాయలను, పరిసరాలను పరిశీలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మధుసూదన్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తమిళ జాలర్ల చొరబాటుపై అధికారుల ఆరా

కోట, జూన్ 24 : కోట, వాకాడు మండలాల పరిధిలోని సముద్రంలోకి తమిళ జాలర్లు అక్రమ చొరబాటుపై అధికారులు ఆరా తీస్తున్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మళ్లీ ప్రారంభమైన జాలర్ల ఆట' అన్న కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు తహసీల్దారు డి.నాగరాజరావు కోట మండలం గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, శ్రీనివాససత్రం పరిధిలోని సముద్రంలో తమిళనాడు నుంచి వస్తున్న బోట్ల వివరాలను పంపాలని, అక్కడ జరుగుతున్న వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని మండలస్థాయి మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ఆయా మండలాల్లో తమిళ బోట్ల చొరబాట్లపై మత్స్యకారులు, ఇటు మత్స్యశాఖ ప్రతినిధులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట


స్వర్ణముఖి నదిలోకి వెళ్లకుండా అధికారులు తవ్వించిన గాడి

నాయుడుపేట టౌన్, జూన్ 24: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు. నాయుడుపేట స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో నదికి పలు ప్రాంతాలలో ఎక్స్‌కవేటర్‌తో గాడులు తవ్వించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు.

ఎన్‌బీకేఆర్‌లో రక్తదాన శిబిరం

కోట, జూన్ 24 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 4వ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పెరేడ్ ట్రైనింగ్, గన్ ఫైరింగ్, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆయుధ శిక్షణ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 16 మంది క్యాడెట్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నెల్లూరుకు చెందిన ఏపీఎస్‌ఆర్ ప్రభుత్వ డాక్టర్ అనిత రక్తాన్ని సేకరించారు. మల్లికార్జున్‌రెడ్డి, గోపీనాథ్, నరేంద్ర, గణేష్ ఉన్నారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం



తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు సోమవారం రూ.20లక్షలు విరాళంగా అందాయి. జార్ఖండ్‌కు చెందిన సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ ఈ విరాళాలను అందజేసింది. ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. ఈమేరకు సంస్థ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర సోమవారం తిరుమలలోని గోకులం విశ్రాంతి గృహంలో ఈవో శ్యామలరావుకు డీడీలను అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఏపీఈఈయూ


నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 24: సదరన్ డిస్కం పరిధిలో ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే ఏపీఈఈయూ(1104) లక్ష్యమని రాష్ట్ర ముఖ్య సలహాదారు చంద్రశేఖర్ అన్నారు. తిరుచానూరు రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం జరిగిన యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులతోపాటు పదోన్నతుల సమస్యలను కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎంపిక

రాష్ట్ర కౌన్సిల్ సమావేశం తర్వాత నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఏపీఈఈయు(1104) సదరన్ డిస్కం అధ్యక్షుడిగా ఎ.వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.నజీర్‌ఖాన్, కార్యదర్శిగా వి.దేవేంద్రరెడ్డి, ముఖ్య సలహాదారుగా చంద్రశేఖర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఎంవీ గోపాలరావు తెలిపారు. డిస్కం కార్యదర్శిగా నాల్గవ పర్యాయం ఎన్నికైన దేవేంద్రరెడ్డిని ఘనంగా సత్కరించారు. డిస్కం పరిధిలోని నాయకులు ఆర్.సంజీవరావు, ఎస్.శర్మ, బి.గురునాథరావు, ఆర్.శ్రీనివాస్, ఎస్.కృష్ణయ్య, పి.జగదీష్, తిరుపతి సర్కిల్ నాయకులు వెలగటూరి గోపి, వేణు, బాలకృష్ణ, రాజేష్, దామోదర్‌రెడ్డి, మునస్వామి, నందగోపాల్, సురేష్, జాఫర్‌వల్లీ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 24: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో అభిషేకాలు నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉద్యోగ మేళాలో పదిమంది ఎంపిక



ఎంపికైన వారితో ప్రిన్సిపాల్

శ్రీకాళహస్తి, జూన్ 24: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం జేకేసీ నిర్వహించిన ఉద్యోగ మేళాలో పదిమంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. 25మంది హాజరయ్యారన్నారు. శ్రీజ మహిళ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారిని ఆమె అభినందించారు. రూ.16వేలు నుంచి రూ.25వేలతో పాటు ఇతర అలవెన్సులు లభిస్తాయన్నారు. జేకేసీ కోఆర్డినేటర్ సతీష్‌కుమార్, జేకేసీ ఎఫ్‌టీఎం గిరిజమ్మ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, జూన్ 24: డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ ఉమామహేశ్వరెడ్డి కోరారు. పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో సోమవారం డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డ్రగ్స్ అనర్థాలను వివరించారు. డ్రగ్స్ విక్రయించినా, తాగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ దశరథరామిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులు,బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 24: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పని చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లమాల విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బందితో గర్భవతులు, బాలింతలు రక్తహీనతతో మరణించకుండా ముందుగానే మంచి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి కాన్పు అనుపత్రిలో జరిగేలా చూడాలన్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారికి తగిన సూచనలు చేసి మందులు అందించాలన్నారు. జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, డీఎన్‌హెచ్ఎన్‌ఓ బేబీరాణి, డీపీఓ ప్రకాష్, డాక్టర్ దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీల్లో 'బడికి పోతాం' ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 24: బడి మానేసిన గిరిజన పిల్లలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు రెండోవ ఎంఈవో మునిసుబ్రమణ్యం తెలిపారు. వేణుగోపాలపురం, తలారివెట్టు గిరిజన కాలనీలలో బడికి పోతాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం ద్వారా ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలన్నారు. ఉపాధ్యాయులు పురుషోత్తం, రామదాసు,యువశ్రీ మురళి, ప్రసాద్, దాసు సీఆర్‌పీ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



పుస్తకాల పంపిణీలో మోహన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 24: పట్టణంలోని కుమారస్వామితిప్ప ప్రాథమిక పాఠశాల, తొట్టంబేడు ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం తెలుగు యువత నాయకుడు మోహన్‌రెడ్డి తన జన్మదినం పురస్కరించుకుని విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచన మేరకు విద్యాసామగ్రి అందజేశానని మోహన్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకుల జయప్రకాష్, తహలీల్, షఫి, గోవర్ధన్, హేమంత్, గోపి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు

కేవీబీపురం, జూన్ 24: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27న దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. 28న ఉదయం 10గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 29న ఫలితాల ప్రకటిస్తామన్నారు. ప్రవేశం పొందిన వారికి జూలై 1 నుంచి తరగతులు నిర్వహిస్తామని వివరించారు.

కాట్రపల్లిలో అతిసారపై అప్రమత్తం



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

కేవీబీపురం, జూన్ 24: కాట్రపల్లిలో అతిసార వ్యాధి ప్రబలిన నేపథ్యంలో సోమవారం వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటికి సర్వే నిర్వహించారు. పంచాయతీరాజ్ డీఈ వెంకటరమణ, ఎంపీడీవో రెడ్డయ్య, పంచాయతీరాజ్ ఏఈ షేక్ జుబేర్ పర్యటించి వైద్యసేవలపై ఆరా తీశారు. తాగునీటి పరీక్షలు నిర్వహించారు. కలుషిత ఆహారం తీసుకోవడం వలనే వ్యాధి లక్షణాలు కనిపించాయని వైద్యబృందం, అధికారులు అవగాహనకు వచ్చారు. శానిటేషన్ చేయించారు. 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉంచినట్లు వైద్యాధికారి కుమార్ తెలిపారు. వైద్యసిబ్బంది, కార్యదర్శి పెంచలయ్య, ఎంసీవో చిన్నఅంకయ్య పాల్గొన్నారు.

రిటైరైన టీచరుకు సత్కారం

కేవీబీపురం, జూన్ 24: కళత్తూరు ఎంపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి రిటైరైన సుగంధిని సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, నాయకులు సన్మానించారు. మండల టీడీపీ నాయకులు రామాంజులనాయుడు, గోపీనాథరెడ్డి, నందకుమార్, మాజీ జడ్పీటీసీ డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు శరధ్ని ఎంపిక



శరధ్నిని సన్మానిస్తున్న శ్రీచైతన్య ప్రిన్సిపాల్ తదితరులు

శ్రీకాళహస్తి, జూన్ 24: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన కె.శరధ్ని జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపికైంది. సోమవారం ఆ విద్యార్థినిని సన్మానించారు. ప్రిన్సిపాల్ రూపాదేవి, ఏజీఎం సురేష్ మాట్లాడుతూ తమ విద్యార్థిని రాష్ట్రస్థాయిలో గెలుపొందడం సంతోషకరమన్నారు. క్రీడల కోఆర్డినేటర్ బాలాజీ, డీన్ సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జిలు త్రివేణి, థామస్, కల్పన, గాయత్రి, పీఈటీ మేఘన, ఉపాధ్యాయులు, ఏవో సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కంచర్లకు గుడిమల్లం ప్రసాదాలు

ఏర్పేడు, జూన్ 24: ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు సోమవారం గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి ఆలయ ప్రసాదాలను ఆలయ చైర్మన్ గిరినాయుడు అందజేశారు. రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం స్వాగతం పలికి సత్కరించారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

మాజీ ఎమ్మెల్యే నెలవలకు సత్కారం



వరదయ్యపాళెం, జూన్ 24: సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యాన్ని సోమవారం స్వచ్ఛత రూరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ మావుడూరు మోహన్ సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థకు తనవంతు సహకారాన్ని అందిస్తామన్నారు.

రాచర్లలో పర్యావరణ దినోత్సవం

వరదయ్యపాళెం, జూన్ 24: రాచర్ల పాఠశాలలో సోమవారం అపోలో టైర్స్ ఫౌండేషన్, రియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పర్యావరణ దిన వేడుకను నిర్వంహించారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే దుష్పరిణామాలు, నీటి సంరక్షణ, ప్రాముఖ్యత, చెట్ల పెంపకం, వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంస్థ సభ్యులు శ్యామ్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని కూల్చినవారిపై చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి, జూన్ 24: పట్టణంలోని కుందేటివారి వీధి ఎస్టీకాలనీలో గంగమ్మ ఆలయాన్ని కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ మిద్దెల హరి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యానాదులు ఆలయాన్ని నిర్మించుకుంటే సహకరించాల్సిందిపోయి ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలని వెంకటేష్ అనే వ్యక్తి, అతని బావమరిది ఆలయాన్ని కూల్చివేశారన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. యానాదులకు క్షమాపణ చెప్పి ఆలయాన్ని పునర్నిర్మించకపోతే ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన

రేణిగుంట, జూన్ 24: మత్తు పదార్థాలపై రేణిగుంట పోలీసులు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థులకు డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో సీఐ మల్లికార్జున్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకం, అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. రేణిగుంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి - సీపీఎం

సత్యవేడు, జూన్ 24: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులు పంటను అమ్ముకోడానికి కార్పొరేట్ కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవా కలెక్టర్ స్పందించి తోతాపురి మామిడి టన్ను రూ.30వేలకు కొనుగోలు చేయాలని ఆదేశించినా పరిశ్రమల యజమానులు పట్టించుకోవడం లేదన్నారు. తక్కువ ధరకే సేకరిస్తున్నారని విమర్శించారు. కొత్త ప్రభుత్వం రైతుల కోసం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బావిలో పూడిక తీతకు శ్రీకారం

వరదయ్యపాళెం, జూన్ 24: వెంగారెడ్డి కండ్రిగ బావి పూడిక తీత పనులను సోమవారం ప్రారంభించారు. సీపీఐ నాయకులు మురళి, చంద్ర మాట్లాడుతూ బావి పూడికతీత తూతూ మంత్రంగా కాకుండా పది అడుగుల లోతు తవ్వాలని కోరారు. పనులు ప్రారంభించినందుకు ఎంపీడీవో చంద్రశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త ఆవిష్కరణలతో విద్యార్థులకు భవిత

- క్రియా యూనివర్శిటీ స్నాతకోత్సవంలో కేంద్ర మాజీ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వయిజర్



స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

శ్రీసిటీ, జూన్ 24: కొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తే భవిష్యత్తు విద్యార్థులదేనని కేంద్ర ప్రిన్సిపల్ సైంటిఫిక్ మాజీ అడ్వయిజర్ డా.విజయరాఘవన్ అన్నారు. శ్రీసిటీలోని క్రియా యూనివర్శిటీలో సోమవారం జరిగిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయరాఘవన్ మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో, విభిన్న దృక్కోణాల నేపథ్యంలో విద్యార్థులు ప్రపంచాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. తన ప్రసంగంతో విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. అనంతరం క్రియా, చెన్నై యూనివర్శిటీలకు చెందిన 350 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు, అవార్డులు అందజేశారు. జెరూసలెంలోని హిబ్రూ యూనివర్శిటీలో హ్యూమనిస్టిక్ స్టడీస్ ప్రొఫెసర్ డేవిడ్ షల్‌మాన్ రెనీలాంగ్, ప్రథమ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈవో డాక్టర్ రుక్మిణీ బెనర్జీలకు వారి వారి రంగాలలో విశేషమైన సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. క్రియా యూనివర్శిటీ ఛాన్సలర్ లక్ష్మీనారాయణన్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలారావు, ఐఎఫ్ఎంఆర్ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీకుమార్, ఎస్ఐఏఎస్ అకడమిక్ డీన్ డాక్టర్ పృథ్వీదత్తా చంద్రశోభి, రీసెర్చ్ విభాగం డీన్ ప్రొఫెసర్ శివకుమార్ శ్రీనివాసన్ ఇతర క్రియా అధికారుల సమక్షంలో పట్టాలను ప్రదానం చేశారు.

యువకుడిపై వైసీపీ కార్యకర్త దాడి: తీవ్రగాయాలు



గాయపడిన సంతోష్

శ్రీకాళహస్తి, జూన్ 24: ఓ యువకునిపై వైసీపీ కార్యకర్త తన అనుచరులతో మూకుమ్మడిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన వైనమిది. తొట్టంబేడు మండలం బీడీకాలనీలో సోమవారం జరిగిన దాడికి సంబంధించి బాధితుని కథనం ప్రకారం కాలనీకి చెందిన సంతోష్ ప్రొక్లైనర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. టీడీపీ తరపున ఎన్నికల్లో చురుగ్గా వ్యవహరించాడు. ఇతనితో పాటు అదే కాలనీకి చెందిన జగదీష్ కూడా టీడీపీ సానుభూతిపరుడే. ఎన్నికల సందర్భంగా కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త హరి ఇటీవల వీరిద్దరితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోఆదివారం రాత్రి హరి కాలనీ రోడ్డులో నిలబడి జగదీష్ రమ్మని ఆదేశించాడు. జగదీష్ రాకపోవడంతో దగ్గరకు వెళ్లి చేయి చేసుకున్నాడు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం విధులకు వెళ్తున్న సంతోష్ వెళుతుండగా కాలనీ శివారులో హరి మరో 8మందితో కలిసి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సంతోష్ శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హరితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి విచారిస్తున్నారు.

బాలికల చదువు భవితకు వెలుగు



ఆడపిల్లల చదువు పోస్టర్‌పై సంతకం చేస్తున్న తహసీల్దారు ఉదయ్ భాస్కర్‌రాజు

ఏర్పేడు, జూన్ 24: బాలికల చదువు దేశ భవితకు వెలుగు అని తహసీల్దారు ఉదయ్ భాస్కర్‌రాజు అన్నారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఆడపిల్లల చదువుపై సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, ఆర్ఐ మల్లయ్య, ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ గిరిజ, టీటీ తిరుమలేశ్వరి తదితర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ భాస్కర్‌రాజు మాట్లాడుతూ ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆడపిల్లల చదువుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో 39మంది బాలికలను ఒకేసారి చేర్పించారన్నారు. ఆ సంస్థ డైరెక్టర్ కేవీ రమణ, మండల కోఆర్డినేటర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ప్రత్యేక కృషి : ఆదిమూలం



విద్యార్థినులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూన్ 24: విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. సత్యవేడు బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తుందన్నారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌళిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లతో సంప్రదించి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు, వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. తానుకూడా ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాల్లోనే చదువుకున్నాని గుర్తు చేసుకున్నారు. ఎంఈవో రవి, తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో చంద్రశేఖర్, సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, నాయకులు మస్తాన్, పరమశివం, ఎంపీటీసీ బీటీఎస్ రెడ్డి, రూపేష్ కుమార్, చిన్న, బాల, ప్రదీప్, ప్రభాకర్‌రెడ్డి, లోకయ్య రెడ్డి, సురేష్ రెడ్డి, సుబ్రమణ్యం శెట్టి, నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలపై తక్షణ విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 24: ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై తక్షణం విచారణ చేపట్టాలని డిప్యూటి తహసీల్దార్ చంద్రబాబునాయుడు చెప్పారు. సోమవారం ఆయన వీర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. భూముల సమస్యలపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సీనియర్ సహాయకులు నాగరాజు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగజాతర చాటింపు



పిచ్చాటూరు, జూన్ 24: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం గంగజాతర చాటింపు వేశారు. సాయంత్రం 6 గంటలకు మహిళలు గ్రామదేవత గంగమ్మ ఆలయానికి చేరుకుని పొంగళ్లు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పూజారి సాంప్రదాయ బద్ధంగా ప్రత్యేక అభిషేక, పూజలు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో గ్రామ పొలిమేరలో చాటింపు వేశారు. గ్రామ సర్పంచ్ రోసిరెడ్డి మాట్లాడుతూ జాతరలో భాగంగా సోమ, మంగల, బుధవారాల్లో గెరిగె ఉత్సవం, బుధవారం సాయంత్రం గంగమ్మతల్లి ఊరేగింపు, గురువారం సాయంత్రం నిమజ్జనంతో జాతర ముగుస్తుందని వివరించారు. గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంత్రి లోకేష్‌కు ప్రసాదాల అందజేత



శ్రీకాళహస్తి, జూన్ 24: మంత్రి లోకేష్‌ను గాండ్ల, తెలికుల బీసీ, సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు సోమవారంమర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు కాశీ విశ్వనాధుని ప్రసాదాలు,గంగా జలాన్ని అందజేశారు.

పుత్తూరు వార్తలు





రథంలో ఊరేగుతున్న శ్రీహరి -అశ్వవాహనంపై శ్రీనివాసుడు

వైభవంగా ప్రసన్న వెంకటేశ్వరస్వామి రథోత్సవం

వడమాలపేట, జూన్ 24: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు రథంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ రథోత్సవం కన్నుల పండుగగా జరిగింది. భక్తులు, ఉప్పు, మిరియాలు రథంపై చల్లి మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామాలు పలుకుతూ రథాన్ని లాగారు. అనంతరం స్వామికి అర్చకులు స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై విహరించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించారు. మంగళవారం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఉదయం 9.15-10.30 గంటల మధ్య స్నపన తిరుమంజనం నిర్వహించాక పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయిస్తారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యులు

పుత్తూరు టౌన్, జూన్ 24: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల కోసం గేటు పుత్తూరులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి, టాటా ట్రస్ట్ వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు. షుగర్, హైపటైటీస్, నోరు, రొమ్ము, గర్భసంచి వంటి ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించింది. 150 మంది పరీక్షలు చేయించుకున్నారు. టాటా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ హేమంత్, వైద్యులు వెంకయ్య బాబు, మోహ తాజ్, రెడ్డికుమారి, రాస్ సిబ్బంది ప్రకాష్, కనకవల్లి, సభ్యులు పాల్గొన్నారు.